
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 12 మే 2023
5
అన్నమయ్య





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష



కుక్కలు బాభౌయ్..

జిల్లాలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. వీధుల్లో గుంపులుగా ఉంటున్న కుక్కలను చూసి జనం భయపడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఏదోఒక చోట రోజూ ఎవరో ఒకరు కుక్క కాటు బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. కుక్కల బెడద నివారించేందుకు అధికార యంత్రాంగం నిర్మాణాత్మక చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది.

- గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- భయాందోళనలో ప్రజలు
- ద్విచక్ర వాహనదారుల్లోనూ భయం
- ఏప్రిల్ నెలలోనే 431 మందికి కుక్కకాటు
- నియంత్రణ చర్యల్లో యంత్రాంగం విఫలం

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. కుక్కలు ఎవరిని పడితే వారిని చిన్న, పెద్ద ,ముసలి, ముతక అని తేడా లేకుండా దాడి చేసి గాయపరచడంతో ఆసుపత్రికి పరుగులు తీయాల్సిన పరిస్థితి జిల్లాలో ఏర్పడింది. ముఖ్యంగా వీధులల్లో చిన్నపిల్లలు ఆడుకుంటూ ఉంటారు. అలాంటి వారిపై కుక్కలు ఒకసారిగా దాడి చేసి ముఖం, కాళ్ళు, చేతులు, పొట్ట భాగాలపై కరవడం ఘాట్లు పడేలా రాక్కడం రక్తస్రావ గాయాలు పాలు అవుతున్నారు.దీంతో పిల్లలు ఏడుస్తూ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కుక్కలను వెంటపడి కొట్టే పరిస్థితి వచ్చినప్పటికీ అవి దొరక్కుండా పరుగులు తీస్తూ ఉన్నాయి. పిల్లలు తల్లిదండ్రులు హుటా హుట్టిన బిడ్డలను తీసుకొని ఆస్పత్రికి వెళ్లి కుక్క కాటుకు టీకాలు, గాయాలకు మందులు వేయించుకుని తీసుకొచ్చి బిడ్డలను జాగ్రత్తగా మరో మారు కుక్కల దాడి పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇది ఇలా ఉంటే పలు వీధుల్లో కుక్కలు గుంపులుగా వాహనాలపై వెళ్లే వారిపై అరుస్తూ, దాడులు చేస్తూ పరుగులు తీస్తున్నాయి. ఈ తొందరలో వాహన దారులు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న పలు వాహనాలను ఢీకొనడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కలు ఎక్కడపడితే అక్కడ వీధుల్లో భారీ సంఖ్యలో గుంపులుగా చేరి వచ్చిపోయే వారిపై అరుస్తూ కరవడం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో రాజంపేట నియోజకవర్గం చిన్న పిల్లల పైన అనేకసార్లు దాడులు చేశాయి.

431 మందికి గాయాలు

జిల్లాలో ఏప్రిల్ ఒక్క నెలలోనే 431 మంది కుక్కకాటుకు గురయ్యారు. అందులో 160 మంది పురుషులు కాగా 271 మంది మహిళలు గాయపడిన వారిలో ఉన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కుక్క కాటుకు మందులున్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ ప్రజలు ఆందోళనలో దగ్గరలో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు. ఇక చీకటి పడితే పట్టణాలలో సందుల్లో వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు ఎక్కడ కుక్కలు ఉన్నాయో లేదో చూసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధిలైట్లు లేని ప్రాంతాల్లో కుక్కలు వస్తున్న వారిపై దాడి చేసి గాయాలు పాలు చేస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ జిల్లాలో కుక్కలను అదుపు చేయడంలో సంబంధంత అధికారులు శ్రద్ధ చూపకపోవడం పట్ల పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కుక్కలు లేకుండా వాటిని పట్టుకు వెళ్లి ద్వారా ప్రాంతాలకు తరలించి వదిలివేయాలని లేకుంటే ప్రాణాలు చేతుల్లో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ పిల్లలు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

రాత్రుల్లో వెళ్లాలంటే భయమేస్తోంది



పట్టణంలో రాత్రి వేలల్లో నడు చుకుంటూ వెళ్లాలంటే కుక్కలతో భయమేస్తోంది. పట్టణంలో ద్విచక్ర వాహనంలో గాని, నడు చుకుంటూ గాని ఒంటరిగా వెళ్లాలంటే కుక్కలు వెంటాడుతున్నాయి. మున్సిపల్ అధికారులు కొన్ని వీధులు మాత్రమే కుక్కలను పడుతున్నారు. పట్టణంలో అన్ని వీధిలో తిరిగి కుక్కలకు టీకాలు వేసి, కుక్కల బెడద లేకుండా చూడాలి.

- కె.వెంకటరమణ, కె.రామాపురం, రాయచోటి.

టీకాలు అందుబాటులో ఉన్నాయి



జిల్లా వ్యాప్తంగా 58 సిహెచ్‌సి సెంటర్లు ఉన్నాయి. రూరల్ 47, అర్బన్ 11 సెం టర్లు ఉన్నాయి. ప్రతి సిహెచ్‌సి సెంటర్లో ఎఆర్‌వి టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్క కాటుకు వలన గాయాలైతే వెంటనే ప్రభుత్వా సుపత్రిలో వెళ్లి వైద్యులు సూచనల మేరకు టీకాలు వేయిం చుకోవాలి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఎన్.కొండయ్య, డిఎంహెచ్ఒ, రాయచోటి.

వేగవంతంగా భూసేకరణ : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపట్టిన గాలివీడు, సంబేపల్లి, ముదివేడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు, మదనపల్లి హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-1, ములకలచెరువు-మదనపల్లి ఎన్‌హెచ్-42లకు భూ సేకరణ అంశంపై సంబంధిత తహశీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లిఫ్ట్ స్కీములను త్వరితగతిన పూర్తి చేయడం వల్ల జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు సమస్యలు తొలుగుతాయన్నారు. ఆయా పథకాలకు సంబం ధించి పెండింగ్ పనులు, ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలన్నారు. వెలిగల్లు-గాలివీడు ఎత్తిపో తల పథకానికి పట్టా, డికెటి, ప్రభుత్వ భూమి 39.29 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. సంబంధిత రైతులతో మాట్లాడి భూమి ధరను నిర్ణయించి వీలైనంత త్వరగా భూసేకరణ చేయాలని చెప్పారు. ఝరికోన ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు ఎత్తిపోతల ద్వారా నీటిని నింపడం ప్రధాన ఉద్దేశమన్నారు. ఇందుకు 26.29 ఎకరాల భూమి అవసరం అవుతుందని తెలిపారు. ఇప్పటికే సేకరించిన భూమికి రెండు రోజుల్లోగా అవార్డ్స్ పాస్ చేసి వెంటనే పరిహారం చెల్లించాలని సూచించారు. ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సేకరించిన 446.5 ఎకరాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.54 కోట్లు పరిహారం త్వరితగతిన రైతులకు చెల్లించాలని ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్‌డిఒ, ఎస్‌డిసి, తహశీల్దార్లను ఆదేశించారు. మదనపల్లి హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-1 పంపు హౌస్ పైప్ లైన్ ఏర్పాటుకు సోంపల్లి, కదిరినాధునికోట, మారెళ్ళగడ్డలకు వచ్చే వారానికి ప్రాథమిక ప్రకటన జారీ చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఆదేశించారు. మొలకలచెరువు, ఎన్‌హెచ్-42కు సంబంధించి అవార్డ్స్ పాస్ చేశామన్నారు. సంబంధితలకు పరిహారం త్వరగా చెల్లించి ఆర్అండ్‌బికి భూమిని అప్పగించాలని సంబంధిత తహశీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ శాఖ నుంచి భూమి అప్పగించగానే వెంటనే పనులు మొదలు పెట్టాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. జిల్లాలోని ఎత్తిపోతల పథకాలు, ఎన్‌హెచ్-42కు భూసేకరణ చేయడంలోగల వివిధ ప్రక్రియలను సంబంధిత శాఖలన్నీ భాగస్వామ్యం వహించి సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమీక్ష సమా వేశంలో డిఆంఒ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, పీలేరు, మదనపల్లి ఎస్‌డిసిలు, సంబంధిత తహశీల్దార్లు, ఇరిగేషన్, ఆర్అండ్‌బి శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభం దిశగా ఆంధ్రప్రదేశ్

మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతుందని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రకాష్ నగర్ కాలనీ పంచా యతీలో ప్రకాష్‌నగర్ రోడ్డు, వారేపల్లి, గొల్లపల్లె, రేగడిగట్టుపల్లె, నగరి గుండ్రేవారిపల్లెల్లో రాష్ట్రానికి ఇదేమిఖర్మ, రచ్చబండ కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాల పేరిట దారి మళ్లించడంతో వెనుకబడిన కులాలకు తీరని అన్యాయం జరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్య క్రమాలు నిలిచి పోయాయన్నారు. కనీసం రోడ్ల మరమ్మతు కూడా లేక అన్ని రంగాలకు కష్టాలు పెరిగాయన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో అప్పుల పాలు అయిందన్నారు. మరో పదేళ్ళు గడిచినా కోలుకోలేని పరిస్థితి ఏర్ప డిందని పేర్కొ న్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు రద్దు అనుభ వానికి వీలుకాని ఇళ్ల స్థలాల పంపిణీ మట్టి ఇసుక దోపిడీల దందా లతో సామాన్య ప్రజల జీవితాల్లో అల్లకల్లోలంగా మార్చారని విమర్శించారు. భూ కబ్జాలు భారీగా పెరిగిపోయే అన్నారు. ముస్లిం, మైనార్టీలకు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు దండుకున్న నాయ కులు వారి సంక్షేమం మరిచారన్నారు. కార్యక్ర మంలో టిడిపి మండల అధ్యక్షులు చిన్న రెడ్డయ్య యాదవ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, గ్రామ అధ్యక్షులు తోక వెంకటరమణ, మండల మైనార్టీ నాయకుడు అబ్దుల్ మునా ఫ్, సుబ్బరాజు యాదవ్, కోళ్ల ఫారం సుబ్బారెడ్డి, మాజీ సర్పంచులు వెంకటయ్య, సిద్ధారెడ్డి, మాజీ ఎంపిటిసి భాస్కర నూరు ఎకరాల రంగారెడ్డి మహదేవ్ పల్లె ప్రసన్నకుమార్ రెడ్డి మండల తెలుగు యువత అధ్యక్షుడు హరి యాదవ్, భాస్కర్‌రెడ్డి, భయారెడ్డి, ఖాదర్ హుస్సేన్, భాస్కర, రఘు, సుబ్బయ్య, మనోహర్‌రెడ్డి, నాగేశ్వర్ నాయుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ, ప్రయివేట్ ఐటిఐ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాజంపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ కె.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనదన్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన వారు iti.ap.gov.inలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమకు దగ్గరలోని ఐటిఐ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకొని, వారు ఇచ్చిన ధ్రువపత్రంతో పాటు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థుల వివరాలు మెరిట్ లిస్టులో ఉండబోవని, తప్పనిసరిగా వెరిఫికేషన్ కూడా చేయించుకోవాలని సూచించారు.

ప్రగతి సాధనకు కృషి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో వందశాతం ప్రగతి సాధించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ గిరీష పి.ఎస్. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డికి వివరించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు నాడు- నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు, స్పందన అర్జీల పరిష్కారం, గ్రామ వార్డు సచివాలయాలు తదితర అంశాలలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్, డిఆర్ఒ సత్య నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టం మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత ఉన్నవారిని గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసిడిఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎన్‌సిడి సర్వేలో భాగంగా ఆధార్ కరెక్షన్ చేయడానికి ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి ఉచిత ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తుందని, ఆ దిశగా అధికారులందరూ కూడా పనిచేయాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది నియామకం త్వరగా చేపట్టాలన్నారు. శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను త్వరగా భర్తీ చేయాలని చెప్పారు. చిన్నపిల్లల ఆధార్ అప్డేషన్ మీద ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. పాఠశాలల అభివృద్ధిలో నాడు నేడులో భాగంగా ప్రతి పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్ తదితర ప్రాథమిక మౌలిక వసతులు ఉండాలన్నారు. వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు తెరిచిన వెంటనే జగనన్న విద్యా కానుక కిట్లను ప్రణాళిక బద్ధంగా విద్యార్థులకు పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేస్తాం

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద జిల్లాలో మొదటి దశలో రీసర్వే చేపట్టిన 84 గ్రామాల్లో ఈనెల 20లోగా స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను వందశాతం పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుండి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం, భూ హక్కు పత్రాలు, భూ రక్షా స్టోన్స్, గ్రౌండ్ టూ థింగ్ ప్రక్రియ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టం ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు జిల్లాలో మొదటి దశలో రీ సర్వే పూర్తి చేసిన 84 గ్రామాలలో హద్దురాళ్లను పాతించడం జరుగుతోందన్నారు. ఇంకా కేవలం 5, 6వేల రాళ్ల మాత్రమే పాతించాల్సి ఉందని, మరో నాలుగు ఐదు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. అలాగే రెండో దశ రీసర్వే చేపట్టిన గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-పీలేరు

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే మన అందరి కర్తవ్యమని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలియజేశారు. గురువారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పీలేరు మండల మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘ మిత్రలకు 'ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం' అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ గురించి ఆందోళన పడవద్దని, నిర్మూలనకు మెరుగైన అవగాహన అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా నేడు యువత ఎయిడ్స్ వ్యాధి బారినపడడం ఆందోళన కలిగించే విషయమని, కావున ఆ మహమ్మారి నుండి మనల్ని మనం రక్షించుకోడానికి ప్రాథమిక అవగాహన చాలా అవసరమని చెప్పారు. హెచ్ఐవి సోకిన వారిలో దీరెకాలిక జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, జలుబు మొదలగు లక్షణాలు కనబడతాయన్నారు. రక్త పరీక్ష ద్వారా హెచ్ఐవి నిర్ధారించుకుని వ్యాధి నిరోధక శక్తి నిర్వీర్యం కాకుండా మెరుగైన జీవనం కోసం దగ్గర్లోని ప్రభుత్వ వైద్యాధికారిని కలిసి ఉచిత చికిత్స, సలహాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఎఎన్ఎం విజయకుమారి, సిహెచ్ఒ ఆయేషా, వెంకటరత్నం, ఆశ కార్యకర్తలు, విఒ లీడర్లు పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలోని రాయచోటి కొత్తపల్లికు చెందిన కరీమున్ కూతురు వివాహం కోసం ఆజాద్ ఎడ్యుకేషనల్ అండ్ మైనార్టీస్ వెల్ఫేర్ సొసైటీ తరఫున రూ. 9 వేల నగదును గురువారం సాయం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు సాహుల్ హమీద్ మాట్లాడుతూ సమాజంలో పేదరికాన్ని నిర్మూలించడానికి అందరి సహకారం అవసరమని చెప్పారు. సహకారం అం దించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మరెన్నో సేవా కార్యక్రమాలకు ముం దుంటామని సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలు ఆశించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ అలీ, కార్యదర్శి సిబతుర్ రెహమాన్, ట్రెజరర్ ముహీబుల్లా, మౌలానా ఇందాదుల్లా పాల్గొన్నారు.

టమోటా రైతులను ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టమోటా ధరల పతనం కావడంతో ఆర్థికంగా చితికిపోయిన రైతన్నలను ప్రభుత్వం ఉదాహరణ ఆదుకోవాలని మదనపల్లె మార్కెట్ కమిటీ ఎదుట గురువారం టమోటాలను రోడ్డు మీద పోసి టిడిపి నాయకులు నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజంపేట తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ జగన్ ఎన్నికలలో కల్లబొల్లి మాటలు చెప్పి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి, రూ.మూడు వేల కోట్లు విచ్చేస్తానని నమ్మబలికి గెలిచారన్నారు. తర్వాత హామీని గాలికి వదిలేశారని విమర్శించారు. టమోటాలను రైతులు రోడ్లమీద పారవేయడం కనపడలేదా అని ప్రశ్నించారు. క్రాప్ ఇన్సూరెన్స్ చేసి ఉంటే రైతులకు ఈ బాధలు వచ్చేవి కాదన్నారు. ఎకరాకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ నవీన్ చౌదరి,బాలు స్వామి, శివప్రసాద్, శేషాచలపతి, ఎస్.ఎ.మస్తాన్, బండి అమర పెద్దఎత్తున రైతులు, సిపిఐ నాయకులు కృష్ణప్ప పాల్గొన్నారు.



టమోటా మార్కెట్ వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

పల్లె ముంగిటే సంపద



రాజంపేటలోని సంపత తయారీ కేంద్రం

ప్రజాశక్తి - రాయచోటి

'చెత్తే కదాని తేలిగ్గా తీసి పడేయకండి..' ఎందుకంటే ఇప్పుడది సంపదను సృష్టించే వనరుగా మారింది. దాని నుంచి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేస్తూ ఆయా గ్రామ పంచాయతీలు ఆదాయార్జనకు బాటలు వేసుకుంటున్నాయి. చెత్తతో సంపదను సృష్టించుకుంటూ కాదేదీ వృథా అనే విధంగా పల్లెలు ముందుకు సాగుతున్నాయి. తమను తాము శుభ్రంగా ఉంచుకుంటూనే పంచాయతీలకూ ఆదాయం చేకూర్చి పెడుతున్నాయి. ప్రజారోగ్యాన్ని సంరక్షించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న స్వచ్ఛ సంకల్పం'లో ఇదంతా సాధ్యమవుతోంది. ఇప్పటికే ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేందం (ఎస్‌డబ్ల్యూపిసి) ఏర్పాట య్యాయి. ఆయా గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆ చెత్త నుంచి వర్మీకం పోస్టు తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నారు. తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతోంది. జిల్లాలో 30 మండలాల పరిధిలో 501 గ్రామ పంచాయ తీలున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 439 ఎస్‌డబ్ల్యుపిసిలను ఏర్పాటు చేశారు. 62 ఎస్‌డబ్ల్యుపిసిల నిర్మాణాలు వివిధ దశల్లో పురగతిలో ఉన్నాయి. ఒక నెలలోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేంద్రాల్లో 1275 మంది క్లాప్ మిత్రలు, 432 మంది షెడ్ మిత్రలు పనిచే స్తున్నారు. వీరంతా గ్రామాల్లోని వారికి కేటాయించిన కాలనీల్లో చెత్త తరలించే రిక్షాల్లో ఉదయం 6 గంటల నుంచి తడిచెత్త, పొడిచెత్త సేకరించి ఆయా కేంద్రాలకు తరలిస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహణ

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటమే గాకుండా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతూ గ్రామ పంచాయతీలకు ఆదాయం చేకూరుతోంది. క్లాప్ మిత్రలు గ్రామాల్లోని ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఎస్ డబ్ల్యూ పీసీల్లో తడి, పొడి చెత్తను వేరుచేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, గాజు సీసాలు, పనికిరాని గుడ్డముక్కలు, చెప్పులు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, సబ్బు, గుట్కా, బిస్కెట్, పాలకవర్లు, పాడైన బ్యాటరీలు, ఎలక్ట్రికల్ వస్తువులు, పనికిరాని నోటు పుస్తకాలు, అట్టపెట్టెలు, బట్టలు, ఇనుప, స్టీలు తదితర ఘన పదార్థాలను 13 రకాల తొట్లలో నింపి నెలకోసారి విక్రయిస్తున్నారు. కుళ్లిపోయే స్వభావమున్న పశువుల పేడ, మిగి లిపోయిన ఆహార పదార్థాలు, కొబ్బరి పీచు, కూరగాయల తొక్కలు, పచ్చగడ్డి, ఎండుగడ్డి, వంటగదుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థ పదార్థాలను ప్రత్యేక తొట్లలో లే యర్లుగా విభజించి అందులో 45 రోజులపాటు వానపాములు వదిలి వర్మీకం పోస్టు ఎరువును తయారు చేసి కిలో రూ.6 చొప్పున విక్రయించి ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఏడాదికి మేజర్ పంచాయతీకి రూ.80 వేలు నుంచి లక్ష ఆదాయం చేకూరుతోంది. మైనర్ పంచాయతీకైతే సుమారు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం చేరుకుంటుంది.

పరిశుభ్రత, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

గతంలో రోడ్లపై, ఇళ్ల పరిసరాల్లో, డ్రెయినేజీల్లో పడేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతూ, దోమలు, పందులు స్వైర విహారంతో ప్రజలు వివిధ రకాల రోగాల బారినపడేవారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రెండు డస్ట్ బిన్లు సరఫరా చేశారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా క్లాప్ మిత్రలు ఆయా కాలనీల్లోని ఇళ్ల నుంచి సేకరించిన తడిచెత్త, పొడిచెత్తను కేంద్రాలకు తరలిస్తుండటంతో వీధులు, మురుగు కాల్వలు శుభ్రయ్యాయి. ప్రతి శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డిఎల్‌పిఒలు, ఇఒఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో జరిగే పారిశుధ్య కార్యక్రమాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



ఇళ్లలోని చెత్త, చెదారం, వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా డస్ట్ బిన్లలో వేసుకుని ఇళ్ల వద్దకు క్లాప్ మిత్రలు వచ్చినప్పుడు చెత్త రిక్షాల్లో వేసి సహకరించాలి. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు రిక్షా ద్వారా చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించి అక్కడ వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేస్తున్నాం.

-వెంకటేశు క్లాప్ మిత్ర, కూచివారిపల్లె, రాజంపేట.


మా ఊరి ఎరువుకు మంచి గుర్తింపు



మా ఊరిలో తయారు చేస్తున్న వర్మి కంపోస్టు ఎరువుకు మంచి గుర్తింపు వచ్చింది. ప్రతి ఇంటిలో సన్న జీవాలు ఉండటంవల్ల వాటి ద్వారా నుచ్చు వచ్చేది. ఆ నుచ్చును మా పొలాలలో వేస్తే మంచి ఎరువు కాబట్టి పంట బాగా దిగుబడి వచ్చేది. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. మా ఊళ్లోనే ఎరువు ఉత్పత్తి అవుతోంది.

-దుర్గయ్య రైతు, కూచివారిపల్లె, రాజంపేట .

పరిశుభ్రంగా గ్రామాలు



జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువు తయారు చేయిస్తున్నాం. ప్రజలు చెత్త బయట వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్తబండిలో వేయాలని అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో అన్ని గ్రామాల్లో వర్మీ తయారీ ప్రక్రియ ఊపందుకొంది.

- ధనలక్ష్మి, డిపిఒ, అన్నమయ్య జిల్లా.

చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగించాలి

జిల్లాలోని ప్రజలందరూ చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగించాలి. తడి, పొడి చెత్త సేకరణ సంబంధించి ప్రజలకు అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. గృహాలు, గ్రామాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రణాళిక ప్రకారం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి వర్మీ తయారీ ప్రక్రియ మొదలైతే ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ తరహా వర్మీ తయారీ ద్వారానే గ్రామాలకు ఏటా ఆదాయం వచ్చేలా అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ పర్యవేక్షణ చేస్తున్నాం.



-గిరీష, కలెక్టర్, అన్నమయ్య జిల్లా.



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సృజన

అవగాహనతో క్షయవ్యాధిని జయిద్దాం

ప్రజాశక్తి-నందలూరు

క్షయ వ్యాధికి వైద్యుల పర్యవేక్షణలో ఆరు నెలలు మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మందులకు లొంగని మొండి రకం క్షయ వ్యాధిని రాకుండా నివారించవచ్చునని వైద్యాధికారి డాక్టర్ సృజనా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ నందలూరు క్షయవ్యాధి విభాగం పరిధిలో రాజంపేట, పెనగలూరు, నందలూరు మండలాల పరిధిలో 69 క్షయ వ్యాధి కేసులు ఉండగా అందులో నాలుగు మొండి రకం క్షయ వ్యాధి కేసులు ఉన్నాయని తెలిపారు. క్షయ వ్యాధికి మందులు వాడిన కొత్తలో కళ్ళు తిరగడం, వాంతులు, కడుపులో వికారం, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు, మూత్రం రంగుమారడం, నీరసం, కడుపులోమంట, మొదలగు లక్షణాలు సహజమేనని ఆ లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉంటే మందులు వాడటం ఆపకూడదని తెలిపారు. మొండి రకం క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయడం వల్ల అసలు మందులకే లొంగని ఎక్స్‌డిఆర్- టిబిగా మారే ప్రభావం ఉందని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తుల ఇంటిలో ఆరేళ్ల లోపు పిల్లలందరికీ గల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందలూరు మండల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సూపర్వైజర్ పిల్లి జయప్రకాష్, టిబి సూపర్వైజర్ శివరాం, ఎంఎల్‌హెచ్‌పి ఆరిఫ్‌బాబు, ఎఎన్ఎం అంజనమ్మ, నాగమణి ఎంపిహెచ్ఎ లక్ష్మయ్య పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నందలూరు



ఆర్థిక సాయం అందిస్తున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న మణిశర్మ అల్లుడు అనా రోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న యువ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి, బాధితుల ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని ఆ కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతున్న గాంధీనగర్ వాసి పూజారి మణిశర్మ అల్లుడిని అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. ప్రభుత్వం ద్వారా చికిత్స అయ్యే ఖర్చులు వచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ఇబ్బు, స్థానిక నాయకులు, గుండు మల్లికార్జునరెడ్డి, తుంటి రమణయ్య, పుత్తా శంకర్, మెహర్, మహమ్మద్ రఫీ, రాజు, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, జయసింహ, పెంచలయ్య, మురళి పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు


ప్రజాశక్తి-కెవిపల్లి

2023-24 విద్యాసంవత్సరానికి ఆరవ తరగతిలో విద్యార్థులను చేర్చుకొనుటకై నోటిఫికేషన్ వెలువడినట్లు ప్రిన్సిపల్ రెడ్డిప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఆరవ తరగతిలో విద్యార్థులను చేర్చుకోవడానికి ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారని ఒసి , బిసిలు రూ.150, ఎస్‌సి, ఎస్‌టిలు రూ.75లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు www.cse.ap.gov.in/apms.ap.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి సమాచారానికి పాఠశాలను సందర్శించాలని తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 25వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు.

నేడు వైఎస్ఆర్ ఆసరా నిధులు విడుదల

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత నిధులను ఎమ్మెల్యే నవాజ్‌బాషా శుక్రవారం మండల మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేయనున్నట్లు వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, ఎంపిడిఓ లీలామాధవి, ఎపిఎం రజనీకుమారి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా నిధులు డ్వాక్రా సంఘ సభ్యులకు పంపిణీ చేయడానికి శుక్రవారం మధ్యాహ్నం గం.2 లకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) మైదానంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని 591 డ్వాక్రా సంఘాలలోని 5112 మంది సభ్యులు రూ.5.12 కోట్లు రూపాయలను లబ్ధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, సంఘమిత్రలు డ్వాక్రా సంఘ సభ్యులు ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలని తెలిపారు.



జాతరలో టిడిపి నాయకులతో ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

గంగమ్మ జాతరలో 'ఆర్ఆర్'

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని మాధవరం గ్రామం మూలపల్లె గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమాల్లో నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవరం మూలపల్లికి చెందిన టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షులు విశ్వనాథ నాయుడు ఇచ్చిన విందు కార్యక్రమానికి రమేష్‌రెడ్డి హాజ రయ్యారు. అనం తరం ఆయన గ్రామంలోని పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు ఆహ్వానం మేరకు విందు కార్యక్రమాల్లో పాల్గొని గ్రామ సమస్యలపై అరా తీశారు. కార్య క్రమంలో క్లస్టర్‌ఇంచార్జ్ మాధవరం రమణారెడ్డి, రామాపురం తెలుగు యువత అధ్యక్షులు నాగభూషణ్‌రెడ్డి, చిన్నావుల వెంకట రమణారెడ్డి, రైతు సంఘం నాయకులు భాస్కర్‌నాయుడు,రామాంజనేయులు, గ్రామ నాయకులు సురేంద్ర, భాస్కర్, గన్‌మెన్ రాజు, రెడ్డయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నని నిలదీద్దాం

నందలూరు : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జగనన్నకు చెబుదాం అని కాకుండా జగనన్నను నిలదీద్దాం అని పెట్టి ఉంటే బాగుండేదని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ రేవూరి వేణుగోపాల్ అన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల విద్యార్థులను దగా చేసింది సిఎం జగనేనని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 77 జిఒ తీసుకొచ్చి పిజి విద్యకు దూరం చేశారని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని తీసేసి కార్పొరేట్ స్థాయి విద్యను ఎస్‌సి విద్యార్థులకు అందకుండా చేశారని తెలిపారు. ప్రజలు ఇప్పటికే జగన న్నని వెళ్లగొడుదామని నిర్ణయించుకున్నారన్నారు. సమావేశంలో మొగిలి కాలవ శివ, సుబ్బయ్య, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని సంతవనం దళితవాడకు చెందిన పత్తూరి భాగ్యమ్మ (52) నలభై రోజులుగా జ్వరంతో బాధపడుతూ బెంగుళూరులో ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలు భౌతికాయాన్ని గురువారం సంతన్నవారిపల్లి తీసుకొని రావడంతో కుటుంబ సభ్యులు నివాళు లర్పించారు. రూ. 29 లక్షలు ఖర్చు చేసి వైద్యం చేసినా మృతి చెందడం బాధకరమని మృతురాలి భర్త, మాల మహానాడు సంఘ అధ్యక్షుడుగా కొత్తూరు భాస్కర్ తెలిపారు.ఆర్థికంగా చితికి పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాని గ్రామస్తులు కోరారు.

రహదారుల నిర్మాణమే లక్ష్యం :'గడికోట'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

నియోజక వర్గంలో పల్లె పల్లెనూ కలుపుతూ రహదారులును నిర్మించడమే జగన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పందిళ్ళపల్లె కస్పా రోడ్డు నుంచి గుంటిమడుగు రోడ్డు, శ్రీరామపురం, దొమ్మరపల్లె వరకు రూ3.85 కోట్లు నిధులుతో పూర్తయిన తారు రోడ్డు నిర్మాణపు పనులను మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజేందర్‌రెడ్డితో కలిసి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో అన్ని ప్రాంతాలకు సరైన రహదారి సౌకర్యాలను కల్పించడం జరుగుతోందన్నారు. కోతలగుట్టపల్లె, నల్లగుండ్లపల్లె, జె.వడ్డెపల్లె, కొక్కంటి వాండ్లపల్లె, శ్రీరాం, దొమ్మరపల్లెలలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులుతో కలసి శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప మండల అధ్యక్షులు సమర సింహా రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజేంద్రనాథరెడ్డి, ఎంపిటిసి ఉదయగిరి ఎల్లమ్మ, సర్పంచ్ పసుపుల సుబ్బమ్మ, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు,



తారురోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

తహశీల్దార్ నరసిం హులు, ఇఒపిఆర్‌డి పట్నాయక్, ఉద్యాన శాఖ అధికారి నాగమణి, ఎంఇఒ చక్రే నాయక్, హౌసింగ్ ఎఇ.జనార్ధన్, వైసిపి నాయకులు మల్ రెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విశ్వనాథ రెడ్డి, నాసిర్,రెడ్డి కృష్ణ, లక్ష్మి రెడ్డి, పంచాయితీ రాజ్ ఎఇ సుబ్రమణ్యం, వ్యసాయ అధికారి కిషోర్ నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కిషోర్, ఎపిఒపెంచలయ్య, నాయకులు గంగిరెడ్డి, విశ్వనాథ, వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు తాగునీటి బోరు మంజూరు



తాగునీటి బోరు పనులను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

ప్రజాశక్తి-కలికిరి

ఆర్యవైశ్య శ్మశాన వాటికకు ఎంపీ నిధులతో తాగునీటి బోరు మంజూరైనట్లు వార్డు మెంబర్ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కలికిరి గ్రామంలో బ్రాహ్మణ , ఆర్యవైశ్య సంఘం శ్మశాన వాటిక నిర్మాణానికి సంబంధించి కావాల్సిన మౌలిక సదుపాయాలు కోసం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అన్నారు. వారు స్పందిస్తూ ముందస్తుగా బోరు, మోటారు సర్వీసు కోసం రూ.3.5 లక్షలు మంజూరు చేశరని చెప్పారు ఆ నిధులతో బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ రెడ్డప్ప, మండలాధ్యక్షులు చింతల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోండి


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలో మండల వ్యవసాయ అధికారి నాగప్రసాద్, ఉద్యాన అధికారి ఈశ్వర ప్రసాద్‌లు సంయుక్తంగా కొత్తపల్లి, అంకిశెట్టిపల్లి, కొండామఠ్రిపల్లి పంచా యతీలలో పర్యటించి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, రైతులు, వాలంటీర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం జరిగిన సదస్సులలో మండల వ్యవసాయ అధికారి నాగప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ 2023కు వేరుశనగ విత్తన పంపిణీ గురించి తెలిపారు. ఈ-పంట నమోదు యొక్క ప్రాధాన్యతను గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. పిఎం కిసాన్ ఇకెవైసి , యంత్ర పరికరాల వినియోగం గురించి వివరించారు. సిసి ఆర్‌సి కార్డులు, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతులకు 11 నెలలకు క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్ గురించి సంపూర్ణ అవగాహన కలిగించారు. సచివాలయం పరిధిలో ఆర్‌బికెల నుంచి ఎరువులు, పురుగు మందులు రాయితీ మీద అందజేస్తున్న అంశాలు గురించి తెలిపారు. ఉద్యానశాఖ గురించి ఈశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు,



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి నాగప్రసాద్

ముఖ్యంగా బిందు సేద్యం, ఇ-పంట నమోదు, మల్చింగ్ షర్ట్స్ కి ఎస్‌సి, ఎస్‌టి వర్గానికి ఇచ్చే రాయితీలు రైతులకు తెలిపారు. ఫామ్ పాండ్స్, ఆక్వా కల్చర్ , మల్బరీ కల్చర్ గురించి వాటి ప్రయోజనాల గురించి రైతులకు సమగ్రంగా వివరించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

తిరుణాలకు రూ.50 వేల వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని గుండ్లూరు దళిత గ్రామంలో నిర్వహించ నున్న మాతమ్మ తిరుణాలకు ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జున రెడ్డి గురువారం గ్రామస్తులకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తిరుణాల, జాతరలు మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేస్తాయని, అమ్మవారి వేడుకలకు తన వంతు సహాయం అందించడం ఆనందదాయకమని ఈ సందర్భంగా మేడా తెలిపారు.

కనులపండువగా ఉమామహేశ్వరస్వామి కల్యాణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల కేంద్రంలోని మందరం, రాచపల్లి గ్రామంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారికి కుంభాభిషేకం నిర్వహించారు. విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి వారి శాంతి కళ్యాణోత్సవాన్ని వేద పండితులు మంగళ హారతులు, మంత్రోచ్ఛారణాలు, మంగళ వాయిద్యాలు నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సంపతి ఉమాపతి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణానికి ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్‌రాయుడులతో పాటు పార్టీలకు అతీతంగా నాయ కులు, ప్రముఖులు, అధికారులు, అనధికారులు, మందరం గ్రామపం చాయతీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. కళ్యాణ అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భోజన వసతిని కల్పించారు. కార్యక్రమంలో మందరం గ్రామపంచాయతీ వైసిపి నాయకులు తంబెళ్ళ వేణుగోపాల్‌రెడ్డి, వెలగచర్ల గంగిరెడ్డి, అత్తిరాల ఆలయ చైర్మన్ వెలగ చర్ల వెంకటసుబ్బారెడ్డిలతోపాటు టిడిపి నాయకులు గన్నే సుబ్బనరసయ్య, డిఆర్‌ఎల్ మణి, కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు స్వయం ఉపాధిపై శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి

పట్టణంలోని అమ్మ చెరువు మిట్ట వద్ద గల వెలుగు ప్రత్యేక పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులకు స్వయం ఉపాధిపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి పేర్కొ న్నారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపి,స్వయం ఉపాధి ద్వారా వారి ఆర్థిక ఎదుగుదలకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పా టు చేయడం జరిగిందన్నారు.కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు ఎస్‌ఐ పిడిఎ యాక్ట్ -2016 మేరకు 15 సంవత్సరాలు పైబడిన దివ్యాంగులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చునని అన్నారు. ముఖ్యంగా అగరబత్తీల తయారీ, జూనియర్ డేటా అసోసియేట్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, కుట్టు మిషన్లపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు ఎం.ఉదయ మోహన్ రెడ్డి (సెక్రటరీ) - 7799996609,ఆర్.భాగ్యలక్ష్మి మొబైల్ నెంబర్లను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-టి.సుండుపల్లి

మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నందు మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు రామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విశ్వనాథరెడ్డిని కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రధాన కేంద్రమైన బస్‌షెల్టర్ వద్ద మరుగుదొడ్లు లేక దూరపు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, దూరప్రయాణాలు చేసే వారికి మహిళలు, స్కూల్, కాలేజ్ పిల్లలు, వృద్ధులు పలు రకాల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్‌టిసి డిఎంకు తెలిపి బస్‌షెల్టర్ నందు మరుగుదొడ్ల ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు మహాదేవ, లోకేష్, శివశంకర్ రాజా, మహేష్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని లక్కిరెడ్డిపల్లి-రాయచోటి ప్రధాన రహదారిలో దర్గా సమీపంలో గురువారం రాత్రి పిడుగు పడి గంపల నారాయణ(55) అనే వ్యక్తి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.మృతుడు లక్కిరెడ్డిపల్లి నుంచి బాలాజీ నగర్ ఎస్‌సి కాలనీ ఇంటికి స్కూటర్లో వెళుతుండగా గాలివాన పెద్దగా రావడంతో మృతుడు ఇంటికి వెళ్లే దర్గా వద్ద పైనుంచి పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బాలిపోగు సురేంద్రకు గాయాలైనట్లు బంధువులు తెలిపారు. అక్కడే ఉన్న స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు.కుటుంబానికి ఆసరాగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబం అనాథగా మిగిలింది. వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామ ప్రజలుకోరారు.

రాజన్న ఉచిత భోజన స్థల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాజన్న ఉచిత భోజన స్థల, వంటశాల ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ప్రొద్దుటూరు పేద ప్రజలకు త్వరలో రాజన్న ఉచిత భోజనం ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మున్సిపల్ పెట్రోల్ బంకు పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న చిరు వ్యాపారులతో మాట్లాడారు. ఈ స్థలం మున్సిపాలిటీకి చెందినదని, అవసరమైనప్పుడు దీన్ని ఖాళీ చేయాల్సి వస్తుందని చెప్పామన్నారు. ఎప్పుడు ఖాళీ చేయాలనేది మున్సిపల్ కమిషనర్ చెబుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ స్థలంలో రాజన్న ఉచిత భోజనంతోపాటు మొబైల్ భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బాలశౌరి, వైసిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి కల్లూరు నాగేంద్ర,రాజుపాలెం మడల ఉపాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు లక్కిరెడ్డి పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

14న హనుమజ్జయంతి

దువ్వూరు :ఈ నెల 14న హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆల య నిర్వాహకులు చిన్న వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ఆకుపూజ, హోమం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

రక్తదాతకు కృతజ్ఞతలు

జమ్మలమడుగు : ఆపదలో ఉన్న మహిళకు ఏ పాజిటివ్ రక్తాన్ని అందించినట్లు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్‌రావు తెలిపారు. స్థానిక క్యాంబెల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బి.నాగమ్మభాయ్ అనే మహిళకు ఏ పాజిటివ్ రక్తం అవస రంకాగా.. బాధితులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావును సంప్రదించారు. ఆయన వెంటనే ఫౌండేషన్ సభ్యుడు భానుచందర్ ద్వారా రక్తదానం చేయించారు. రక్తదాత భానుచందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మోరే లక్ష్మణ్‌రావు, గురు రాజశేఖర్ పాల్గొన్నారు.

నిర్బంధించడం అప్రజాస్వామికం

జమ్మలమడుగు రూరల్ : ఈనెల 12న టిడిపి చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నిర్బంధించడం అప్రజాస్వామ్యమని టిడిపి తెలుగు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. గురువారం పోలీసులు ఆయన ఇంటి వద్దకు వచ్చి విజయవాడకు వెళ్లకుండా నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికా ర్జున మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు నష్ట పోయి ఇబ్బందులు పడు తుంటే వైసిపి ప్రభుత్వం వారికి అండగా నిలవకపోగా, నిలిచే వారిని ఎక్కడి కక్కడ అరెస్టు చేయడం దారుణమన్నారు. నోటీసులతో బెదిరించడం సిగ్గు చేటన్నారు. ఏ మాత్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నా వెంటనే నష్టపోయిన రైతు లందరికీ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. అలాగే మిర్చి రైతులు ఆరు గాలం కష్టపడి గోడౌన్లకు చేర్చిన తర్వాత వర్షానికి తడిసిపోతే వాటికి ధర తగ్గిం చడం సబబు కాదన్నారు. ప్రస్తుతం ఉన్న రేటుకే మిరపను కొనుగోలు చేయాలన్నారు.



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పుస్తక పఠనం జీవితంలో భాగం కావాలి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చిన్న మండెం శాఖ గ్రంథాలయ నిర్వాహకుడు ఆంజనేయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం అనేది ఒక పుస్తక భాండాగారమని పుస్తకాలు చదివినచో జ్ఞానం అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన అన్నారు. కార్యక్రమంలో భాగంగానే గురువారం స్పోకెన్ ఇంగ్లీష్, క్రీడలు తదితర వాటి గురించి చిన్నపిల్లలకు వివరించారు. **రాజంపేట అర్బన్ :** స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి జె.రామనాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 8 నుంచి నిర్వహించబడుతున్న గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరానికి విశేష స్పందన ఉన్నదని, జూన్ 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడు తుందని చెప్పారు. గ్రంథాలయంలో పుస్తక పఠనం, నిష్ణాతులతో కథలు చెప్పడం, చదివిం చడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పిల్లల మేధోశక్తిని పెంపొందించేందుకు తల్లిదండ్రులు తమ పిల్లల్ని గ్రంథాలయానికి పంప వలసినదిగా ప్రోత్సహించాలని సూచించారు. గ్రంథాలయంలో పిల్లలకు కావలసిన అన్ని సదు పాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయానికి పంపించాలని కోరారు.

యువత ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-నందలూరు

నేటి యువత ప్రశ్నించే గుణాన్ని అలవరచుకొని, సమాజ అభివృద్ధికి పాటుపడాలని యువ నాయకులు మేడ విజయ శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, అరవ పల్లె లోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ ఏడవ సీజన్ ఓపెన్ టు ఆల్, హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జయాపజయాలను సమానంగా తీసుకోవాలని అన్నారు. ఐక్యతతో ఏదైనా సాధించవచ్చు అని, సమిష్టి కృషితో విజయం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మైనార్టీ కమిషన్ సలహాదారు షబ్బీర్ అహ్మద్, ఉప సర్పంచ్ ఇబ్బు, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు వేపగుంట శ్యామరాజ్, పోతురాజు మస్తానయ్య, అరిగే మని, లోకో పైలట్ పిఇకె మూర్తి, పాస్టర్ నామాల రవీంద్ర, క్రీడాభిమాని బూదెల ప్రభాకర్, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ పల్లె గ్రీస్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

ఆడిట్ ద్వారా పారదర్శకత

ప్రజాశక్తి-వీరబల్లి

ఆడిట్ ద్వారా పారదర్శకత ఉంటుందని వైఎస్ఆర్ క్రాంతి పథం మండల సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఖాదర్ వలి అన్నారు. గురువారం మండల మహిళా సమాఖ్య పరిధిలోని 27 గ్రామ సమాఖ్యల 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంభందించిన లావాదేవీలు ఆడిటర్ జయకృష్ణ టీమ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఆడిట్ ద్వారా సమాఖ్యల లావాదేవీల నిర్వహణ ద్వారా ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ ప్రణాళిక ద్వారా పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన ఉంటుందన్నారు. స్వయం సహాయక సంఘాల తీసుకొన్న రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నది లేనిది, పుస్తక నిర్వహణ, జీవనోపాధులు మెరుగుపడడం తదితర అంశాలపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లీగల్ కో-ఆర్డినేటర్ ఆనంద్‌బాబు, సిసిలు శంకర్ నాయక్, కృష్ణయ్య, కుల్లాయప్ప, శుభద్రమ్మ, వెంకటలక్ష్మి, బాలగుర్రయ్య, సమాఖ్య అకౌంటెంట్లు చంద్రశేఖర్ రాజు, మరియమ్మ, గామ సమాఖ్యల పదాధికారులు, విఒఎలు పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వినయ్ బాబు

టిబి రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

దాతల సహకారంతో మండలం లోని క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందించినట్లు మండల వైద్యధికారి డాక్టర్ వినయ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రతి నెలా పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఈ పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వేసుకుంటే వ్యాధి నుంచి విముక్తి పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సుధాకర్ బాబు, టిబి సూపర్వైజర్ హరి, సుబ్బయ్య, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, ఎంపిహెచ్ నాగయ్య, ఫార్మసిస్ట్ కృష్ణయ్య పాల్గొన్నారు.

నేలమల్లేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన

నిమ్మనపల్లి : మండలంలోని తవళం శ్రీ నేల మల్లేశ్వరస్వామి ఆలయంలో నాగదేవత విగ్రహాల ప్రాణ ప్రతిష్టను శాస్త్రోత్తంగా నిర్వహించినట్లు ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ తెలిపారు. మదనపల్లి నీరుగట్టివారిపల్లికు చెందిన నాగదేవత విగ్రహాల, శంకారపు మంజుల, శంకారపు భాస్కర దంపతులు చేత కత్తిరివారిపల్లెకు చెందిన పురోహితులు శంకరశర్మ, లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఆలయం వద్ద సందర్శకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాకీ విషయంలో ఘర్షణ : కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

బాకీ డబ్బులు అడిగినందుకు ఘర్షణకు దిగి దాడిచేసి గాయపరచడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ పెద్దిరెడ్డిగారిపల్లెకు చెందిన కంభం అనిల్ కుమార్‌రెడ్డి వద్ద గుర్రంకొండ మండలం నడిపి కండ్రిక పంచాయతీ గరికుంటపల్లి గ్రామానికి చెందిన దేరంగుల మురళి కుమారుడు దేరంగుల నరేంద్ర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. ఈ క్రమంలో అనిల్ కుమార్‌రెడ్డి వద్ద నరేంద్ర అతను వద్ద పనిచేస్తున్న సమయంలో రూ.1.30 లక్షలు అప్పుగా తీసుకున్నాడు అప్పు తీసుకున్నప్పటి నుంచి కొద్దిరోజులు డ్రైవర్‌గా పనిచేసే అప్పు తీర్చకుండా మానుకున్నాడని అన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని కదిరాయ చెరువు పంచాయితీ వడ్డిపల్లి వద్ద నరేంద్ర జెసిబి వాహనంతో పనిచేస్తూ ఉంటే అక్కడికి అనిల్ కుమార్‌రెడ్డి, సునీల్‌రెడ్డి వెళ్లి ఇచ్చిన అప్పును తీర్చమని అడిగారని తెలిపారు. ఈ క్రమంలో నరేంద్ర మీకు బాకీ లేనని దుర్భాషలాడి, రాళ్లు, కర్రలతో దాడిచేసినట్లు చెప్పారు. నరేంద్రతో పాటు నాగార్జున, దేరంగుల వెంకట్రమణ, దేరంగుల బలరాంలు కలసి కొట్టి గాయ పరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. దేరంగుల వెంకటరమణ కొడవలితో సునీల్‌రెడ్డిని గాయపరిచినట్లు అనిల్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.